ప్రజాశక్తి

శనివారం 18 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# పరిహారం వచ్చేనా..!



యలమంచిలి మండలం తెరువుపల్లిలో నీటమునిగిన వరిచేను (ఫైల్ ఫొటో)

- ఆర్నెల్లవుతున్నా అందని మిచౌంగ్ ఇన్‌పుట్ సబ్సిడీ
- ఎదురుచూస్తున్న 28,247 మంది రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో మిచౌంగ్ తుపాను బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నేటికీ అందలేదు. పంట నష్టం జరిగి దాదాపు ఆరు నెలలవుతున్నా ఇంతవరకూ రైతుల ఖాతాల్లో పరిహారం జమకాకపోవడంతో వారంతా ఇబ్బందిపడుతున్నారు. నాటి తుపానుతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. దెబ్బతిన్న పంటను గుర్తించడంలో విధించిన నిబంధనలు పంట నష్టపోయిన రైతులందరూ పరిహారానికి నోచుకోకుండా చేశాయి. అనేక వడపోతల తరువాత జిల్లాలో మిచౌంగ్ తుపానుకు 28,247 మంది రైతులకు చెందిన 16,472 ఎకరాల్లో రూ.11,29,89,000 విలువైన పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అప్పట్లో ప్రభుత్వానికి నివేదించింది. ఆ నివేదిక ప్రకారం మార్చిలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ రైతులకు ఇన్‌పుట్ సొమ్ము జమకాలేదు.


జిల్లాలో మిచౌంగ్ తుపానుకు గతేడాది ఖరీఫ్‌లో రూ.11.20 కోట్ల విలువైన 16,472 ఎకరాల్లో వరి, చెరకు పంటతో పాటు 291 మంది రైతులకు చెందిన రూ.9.74 లక్షల విలువైన 131 ఎకరాల్లో ఉద్యానశాఖ పంటలైన అరటి, తమలపాకులు, బొప్పాయి, కూరగాయలు దెబ్బతిన్నాయి. మార్చి 6న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయం నుంచి పరిహారం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు బటన్ నొక్కారు. కానీ రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహారం డబ్బులు ఇప్పటి వరకూ పడలేదు.

**దయ చూపని సర్కారు**

గతేడాది ఖరీఫ్ రైతును కుంగదీసింది. కరువుతో అల్లాడిన జిల్లాను ఆదుకోవడంలో ప్రభుత్వం కనీస దయ చూపలేదు. వర్షాభావ పరిస్థితులతో కరువు జిల్లాగా ప్రకటించడానికి అర్హతలున్నా ప్రభుత్వం గుర్తించలేదు. కరువు జిల్లాగా ప్రకటించాలని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మిగతా 2లో..

ఎట్టకేలకు గంగవరం పోర్టు నుంచి

## విశాఖ ఉక్కుకు కొకింగ్ కోల్, లైమ్‌స్టోన్



ప్రజాశక్తి - ఉక్కునగరం : హైకోర్టు ఆదేశాలతో విశాఖ జిల్లా కలెక్టర్, సిటీ పోలీస్ కమిషనర్ అదానీ గంగవరం పోర్టు యాజమాన్యంతోనూ, కార్మికులతోనూ జరిపిన చర్చలు కొంత సానుకూలంగా సాగడంతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కి గంగవరం పోర్టు నుంచి కొకింగ్ కోల్, లైమ్ స్టోన్ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి రావడం ప్రారంభమైంది. ఎ-షిఫ్ట్‌లో 4248 ఎంటి, బి - షిఫ్ట్‌లో ఐదు గంటలకు 2300 ఎమ్‌టి మొత్తంగా శుక్రవారం రాత్రికి 15000 ఎమ్‌టి రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే లైమ్ స్టోన్ 4200 మెట్రిక్ టన్నులు ఒక ర్యాక్‌లో లోడై విశాఖ ఉక్కు కర్మాగారంలో దిగింది. 15 రోజుల్లో గంగవరం పోర్టులో ఉన్న 3 లక్షలా 25 వేల టన్నుల సరుకును విశాఖ ఉక్కుకు తరలించనున్నారు. అలాగే మరో కోకింగ్ కోల్ వెస్సెల్ 22వ తేదీ నాటికి అమెరికా నుంచి 79 వేల మెట్రిక్ టన్నుల మేర రానుంది. ఈ క్రమంలో మరో వారం రోజుల్లో సాధారణ ఉత్పత్తి దిశగా ప్లాంట్ నడిచే అవకాశముంది. ఇప్పటికైనా స్టీల్ యాజమాన్యం ఉద్యోగులకు జీతాలు చెల్లించి పూర్తిస్థాయి ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

భువనేశ్వర్ నుంచి దువ్వాడ మీదుగా

## షోలాపూర్, ముంబయ్‌లకు వన్‌వే ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి భువనేశ్వర్ - షోలాపూర్, భువనేశ్వర్ - సిఎస్‌టి ముంబయ్‌కి మధ్య వన్‌వే ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ మేరకు 01452 భువనేశ్వర్ - షోలాపూర్ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 20 సోమవారం ఉదయం 04.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి 11.43 గంటలకు దువ్వాడ చేరుకొని మరల 11:45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07:00 గంటలకు షోలాపూర్ మిగతా 2లో..

### అందుబాటులో కూరగాయల ధరలు

▸ వార్త 2లో..

### విశాఖలో స్ట్రాంగ్ రూముల తనిఖీ

▸ వార్త 2లో..

### వేతనాలు చెల్లించాలని ఉక్కు ఉద్యోగుల ధర్నా

▸ వార్త మెయిన్‌లో..

స్వార్థ రాజకీయాల కోసం

## ఉత్తరాంధ్ర ప్రశాంతతను చెడగొట్టొద్దు : బొత్స

కంచరపాలెం ఘటనకూ, రాజకీయాలకూ సంబంధం లేదని వ్యాఖ్య



మాట్లాడుతున్న బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వార్థ రాజకీయాల కోసం ఉత్తరాంధ్ర ప్రశాంతతను చెడగొట్టొద్దని, బుధవారం విశాఖ పార్లమెంటు పరిధిలోని కంచరపాలెంలో జరిగిన దాడి ఘటనను రాజకీయ కోణంలోకి తీసుకువచ్చి లేనిపోని అపోహలు సృష్టించవద్దని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆ సంఘటనకు రాజకీయాలతో సంబంధం లేదని తెలిపారు. శుక్రవారం సాయంత్రం లాసన్స్ బే కాలనీలోని బొత్స ఝాన్సీ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 9న రాష్ట్రానికి రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో ప్రమాణస్వీకారం చేయనున్నారన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతం అంటే శాంతియుతంగా, సోదరభావంతో ఉండే ప్రాంతమని తెలిపారు. శాంతియుతమైన ఈ ప్రాంతంలో రాజకీయ లబ్ధి కోసం లేనిపోని ఆరోపణలు చేస్తూ అల్లర్లను ప్రేరేపించవద్దని అన్నారు. ఇదే సందర్భంలో రాజకీయ నాయకులు కూడా అనవసరమైన నిందారోపణలు చేయడం తగదన్నారు.

**ఏ ప్రాంతంలో అధికారులను మార్చారో అక్కడే అల్లర్లు**

మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు బొత్స సమాధానం చెబుతూ ఏ ప్రాంతంలో అధికారులను మార్చారో అక్కడే అల్లర్లు జరిగాయని అన్నారు. ఎన్నికల కమిషన్ నియమించిన ఓ రిటైర్డ్ పోలీసు అధికారి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల తాము గవర్నర్‌ని కలిసి ఫిర్యాదు చేశామని స్పష్టం చేశారు. ఇలాంటి సున్నితమైన సమయాల్లో ఒక అధికారిని నియమించే ముందు ఆ అధికారి పూర్వాపరాల గురించి కూడా తెలుసుకోవాలని తెలిపారు. గతంలో ఆ అధికారి ఉద్యోగ బాధ్యతల్లో ఎలా పనిచేశారు ? ఆయన కాలంలో ఎటువంటి సంఘటనలు మిగతా 2లో..

## జగన్ ఉత్తరాంధ్రకు చేసిందేంటి ?

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా



మాట్లాడుతున్న బొండా ఉమా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఎం జగన్ ఉత్తరాంధ్రకు ఈ ఐదేళ్లలో చేసిందేమిటో చెప్పగలరా ? అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమా ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రానుందని అన్నారు. శుక్రవారం టిడిపి విశాఖ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేలు వచ్చాక జగన్మోహన్ రెడ్డి గురువారం ఐప్యాక్ టీం దగ్గరికి వెళ్లి ఒక చిన్న ఓదార్పు యాత్ర చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓటమిపాలైతే వైసిపిని మూసేస్తానని జగన్ చెప్పగలరా ? అని ప్రశ్నించారు. ఐప్యాక్ ఆఫీస్‌లో జగన్ కోతలు కోశారన్నారు. ఆయన వెనుక ఉన్న రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ముఖం ఆ సమయంలో వాలిపోయిందని తెలిపారు. ఈసారి ఓటమి ఖాయమని ఐప్యాక్ స్పష్టం చేసిందన్నారు. అన్ని తరగతులనూ నాశనం చేసిన జగన్ ప్రభుత్వాన్ని దించడానికి ప్రజలు అర్ధరాత్రి 12 గంటల వరకూ ఓటు వేశారని తెలిపారు. ఎన్‌డిఎ కూటమి ఎపిలో గెలుస్తుందని జాతీయ స్థాయి గుర్తింపునొందిన 15 సర్వే సంస్థలు చెబుతుంటే జగన్మోహన్ రెడ్డి ఇంకా తామే అధికారంలోకి వస్తామనడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. లెక్కింపు రోజు వైసిపికి బూత్ ఏజెంట్లు కూడా దొరకని పరిస్థితి వస్తుందన్నారు. రహస్యంగా ఇచ్చిన జీవోలను, నోట్‌ఫైల్స్‌ను ఈ - ఆఫీస్ అప్‌గ్రేడ్ పేరుతో నాశనం చేస్తున్నారని తెలిపారు. దీని వెనకాల కుట్ర దాగి ఉందన్నారు. చేసిన దుర్మార్గాన్ని రాబోయే ప్రభుత్వం చూడకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులను బ్లాక్‌మెయిల్ చేయడం కోసం ఐప్యాక్ సమావేశం పెట్టారన్నారు. పాత ఫైల్స్‌ను ధ్వంసం చేస్తున్న అంశంపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. పల్నాడు, అనంతపురం ఎస్పీలు ఎలా భ్రష్టుపట్టిపోయారో చూసి మిగిలినవారు కళ్లు తెరవాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి చేసిన ఆదేశాలకు తలాడించిన ఐఎఎస్‌ల గతి గమనించాలన్నారు. రాజధాని పేరుతో విశాఖలో రియల్ ఎస్టేట్ మిగతా 2లో..

## మొదటి పేజీ తరువాయి..

### పరిహారం వచ్చేనా..!

తీర్మానించి ప్రభుత్వానికి నివేదించినా ఫలితం కనబడలేదు. అతి తీవ్ర వర్షాభావంతో పంట సాగుచేయని మండలాలను కూడా కరువు ప్రాంతంగా ప్రకటించలేదు. స్వల్ప వర్షాలకు, జలాశయాల కింద పొలాల్లో వేసిన వరి పంట కోతకు వచ్చే సమయంలో భారీ వర్షాలకు నీటమునిగి కోయడానికి పనికిరాకుండా పోయింది. ఒడిదుడుకుల మధ్య రైతులు పంట సాగుచేశారు. ఖరీఫ్ ప్రారంభంలో రైతును అనావృష్టి వెంటాడగా, పంట వేసిన తరువాత అతివృష్టి దెబ్బతీసింది. ఫలితంగా గతేడాది రైతును అటు ప్రకృతి, ఇటు ప్రభుత్వం కోలుకోలేకుండా చేశాయి. చివరకు మిచౌంగ్ తుపానుకు పంట నష్టపోయిన రైతుకు అందాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడు జమవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

### షోలాపూర్, ముంబయ్‌లకు వన్‌వే ప్రత్యేక రైళ్లు

చేరుకుంటుంది. ఈ రైలు ఖుర్దా రోడ్, బ్రహ్మపూర్, విజయనగరం, దువ్వాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ, సికింద్రాబాద్, వాడి, కలబురగి మీదుగా ప్రయాణిస్తుంది. 01056 భువనేశ్వర్ - సిఎస్‌టి ముంబయ్ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 20 సోమవారం రాత్రి 23.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06.45 గంటలకు దువ్వాడ చేరుకొని మరల 06.53 గంటలకు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు సిఎస్‌టి ముంబయ్ చేరుకుంటుంది. ఈ రైలు ఖుర్దా రోడ్, బ్రహ్మపూర్, విజయనగరం, దువ్వాడ, పిఠాపురం, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్, వికారాబాద్, వాడి, కలబురగి, సోలార్‌పూర్, కురుద్వాడి, దౌండ్, పూణే, లోనావాలా, భుబన్ కళ్యాణ్, దాదర్ మీదుగా ప్రయాణిస్తుంది.

### ఉత్తరాంధ్ర ప్రశాంతతను చెడగొట్టొద్దు : బొత్స

జరిగాయి ? అన్న విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అలా చేయకపోవడం వల్ల, తొందరపాటు నిర్ణయాల వల్ల ఈ అల్లర్లు జరిగాయని తాము గవర్నర్‌కు చెప్పామని అన్నారు. అధికారులెవరైనా చట్టానికి లోబడి పరిపాలన చేయాలిగానీ పక్షపాత ధోరణితో ఉండరాదని అన్నారు. రుషికొండలో కట్టినవి అధికారిక భవనాలని, ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత వాటిని ఏం చేయాలో నిర్ణయిస్తామని, ముఖ్యమంత్రి అధికారిక నివాసంగా ఉంచాలా ? లేదా ముఖ్యమంత్రి పరిపాలనా భవనంగా పెట్టాలా ? అనేది గెలిచాక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

### జగన్ ఉత్తరాంధ్రకు చేసిందేంటి ?

వ్యాపారాలు చేసుకున్న వైసిపి నేతలను ప్రజలు ఓడిస్తారన్నారు. జగన్ సర్కారుకు 13నే బుల్లెట్ దిగిందని, ఆ గాయం పైకి తెలీడం లేదని, జూన్ 4న తెలుస్తుందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక అవినీతి, అరాచకాలపై విచారణ చేయిస్తామని అన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ పాల్గొన్నారు.



ఎంవిపి రైతు బజారులో సాగుతున్న అమ్మకాలు

## అందుబాటులో కూరగాయల ధరలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** మండు వేసవిలోనూ ఈసారి కూరగాయల ధరలు కాస్త అందుబాటులోనే ఉన్నాయి. ముఖ్యంగా నగర పరిధిలోని 13 రైతు బజార్లలో కూరగాయల ధరలను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది. ఇక ధరల విషయం చూస్తే కిలో ఉల్లిపాయలు రూ.24, టమాటా రూ.24, వంకాయలు (తెలుపు) రూ.20, వంకాయలు (నలుపు) రూ.22, బెండకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.52, కాకరకాయలు రూ.32, బీరకాయలు రూ.48, ఆనపకాయ రూ.20, కాలీఫ్లవర్ రూ.30, క్యాబేజీ రూ.26, క్యారెట్ రూ.26, దొండకాయలు రూ.20, బంగాళా దుంపలు 24, అరటికాయ (పెద్దది) రూ.10, అల్లం (పాతది) రూ.140, బరబాటి రూ.40, ముల్లంగి (2) రూ.10, నిమ్మకాయలు (కిలో) రూ.80, గోరుచిక్కుడు రూ.36, దోసకాయ రూ.22, వెల్లుల్లి (పెద్దవి) రూ.180, కొబ్బరికాయ (పెద్దది) రూ.25, బీన్స్ (పెన్సిల్) రూ.70, పొటల్స్ రూ.40, కీరదోస రూ.30, కాప్సికమ్ రూ.56, పొట్లకాయ (పెద్దది) రూ.20, చేమదుంపలు రూ.40, చిలగడ దుంపలు రూ.40, కంద రూ.60, దేముడు చిక్కుడు రూ.56, కొండఉసిరి రూ.70, కొత్తిమీర (పెద్దకట్ట) రూ.20, పుదీన (కట్ట) రూ.5, చుక్కకూర (కట్ట) రూ.1, పాల కూర (కట్ట) రూ.2, తోటకూర (కట్ట) రూ.2, మామిడికాయలు రూ.40, మామిడి పళ్ళ రూ.75, బూడిద గుమ్మడికాయ రూ.28, కర్రపెండలం రూ.34. మామిడి అల్లం రూ.70, బొప్పాయి రూ.36, జామకాయలు (కిలో) రూ.40గా ఉన్నాయి.

**చికెన్ ధరలు పైపైకి..**

కూరగాయల ధరలు కాస్త పర్వాలేదు అనిపించినా, చికెన్ ధరలు మాత్రం పైపైకి చేరుకున్నాయి. స్కిన్ లెస్ కిలో రూ.300, డ్రెస్డ్ రూ.290, లైవ్ రూ.రూ.158. నాటుకోడి రూ.425గా ఉంది. మటన్ ధర చూస్తే కిలో రూ.900గా ఉంది.

# వేసవి ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ప్రయాణికులకు వేసవి కాలంలో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు ఎస్ఎంవి బెంగళూరు - ఖరగ్‌పూర్ ప్రత్యేక రైలు మే 24 నుండి జూన్ 14 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 15.50 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.00 గంటలకు దువ్వాడ చేరుకొని మరల 12.02 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 02.45 గంటలకు ఖరగ్‌పూర్ చేరుకుంటుంది. 6508 ఖరగ్‌పూర్-ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు మే 27 నుండి జూన్ 17 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 14.00 గంటలకు ఖరగ్‌పూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 02.38 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 02.40 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 19.50 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు కృష్ణరాజపురం, బంగారుపేట, కుప్పం, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్డు, భువనేశ్వర్, కటక్, బద్రక్, బాలాసోర్ మీదుగా ప్రయాణిస్తాయి.

06585 ఎస్ఎంవి బెంగళూరు-హౌరా సమ్మర్ స్పెషల్ మే 31 నుంచి జూన్ 14 వరకు ప్రతి శుక్రవారం అర్ధరాత్రి 00.30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరులో బయలుదేరి అదేరోజు రాత్రి 19.25 గంటలకు దువ్వాడకు చేరుకొని మరల 19.27 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.00 గంటలకు హౌరాకు చేరుకుంటుంది. 06586 హౌరా - ఎస్ఎంవి బెంగళూరు సమ్మర్ స్పెషల్ జూన్ 01 నుండి 15 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 13.05 గంటలకు హౌరాలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 03.03 గంటలకు దువ్వాడ చేరుకొని మరల 03.05 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 20.10 గంటలు ఎస్ఎంవి బెంగళూరుకు చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వేలో దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్‌లమీదుగా ప్రయాణిస్తాయి

06569 ఎస్ఎంవి బెంగళూరు - గౌహతి ప్రత్యేక రైలు మే 26 నుండి జూన్ 09 వరకు ప్రతి ఆదివారం అర్ధరాత్రి 00.30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు నుండి బయలుదేరి అదేరోజు రోజు రాత్రి 19.53 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 19.55 గంటలకు బయలుదేరి బుధవారం ఉదయం 06.00 గంటలకు గౌహతికి చేరుకుంటుంది. 06570 గౌహతి - ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు మే 29 నుండి జూన్ 12 వరకు ప్రతి బుధవారం ఉదయం 06.00 గంటలకు గౌహతిలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.08 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 15.10 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 10.00 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్‌ల మీదుగా ప్రయాణిస్తాయి.

06563 ఎస్ఎంవి బెంగళూరు-మాల్దా టౌన్ ప్రత్యేక రైలు ఎస్ఎంవి బెంగళూరు నుండి జూన్ 9 ఆదివారం రాత్రి 23.40 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు నుండి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 18.13 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 18.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 16.30 గంటలకు మాల్దా టౌన్ చేరుకుంటుంది. 06564 మాల్దా టౌన్ - ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు 12 బుధవారం సాయంత్రం 16.00 గంటలకు మాల్దా టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.08 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 15.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరుకు చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్ ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్‌లల మీదుగా ప్రయాణిస్తాయి.

06221 మైసూర్-ముజఫర్‌పూర్ ప్రత్యేక రైలు జూన్ 10 సోమవారం ఉదయం 10.30 గంటలకు మైసూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 07.18 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 07.20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు బుధవారం మధ్యాహ్నం 13.30 గంటలకు ముజఫర్‌పూర్ చేరుకుంటుంది. 06222 ముజఫర్‌పూర్-మైసూర్ ప్రత్యేక రైలు జూన్ 13 గురువారం మధ్యాహ్నం 13.00 గంటలకు ముజఫర్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు 19.18 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 19.20 గంటలకు బయలుదేరి శనివారం సాయంత్రం 16.40 గంటలకు మైసూరుకు చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వేలో దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్‌ల మీదుగా ప్రయాణిస్తాయి.

# స్ట్రాంగ్ రూముల తనిఖీ




స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** రోజువారీ తనిఖీల్లో భాగంగా ఎయు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. అక్కడి అధికారులు, పోలీస్ సిబ్బంది విధి నిర్వహణపై ఆరా తీశారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల తలుపులకు వేసిన సీళ్లను నిశితంగా పరిశీలించారు. అధికారులు, పోలీస్ సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వివిధ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములను పరిశీలించిన అనంతరం జిల్లా ఎన్నికల అధికారి ఆయా లాగ్ బుక్స్‌లో సంతకాలు చేశారు. ఆయన వెంట నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ఒలు, ఇతర అధికారులు ఉన్నారు.

### ఓటింగ్ పెరగడం వైసిపికే అనుకూలం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** సిఎంగా జగన్‌ను మళ్లీ ఎన్నుకునేందుకుకే ప్రజలంతా ఓటింగ్‌కు పోటెత్తారని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. శుక్రవారం సాయంత్రం సిరిపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ సిఎం అయిన తర్వాత రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు మేలు చేసారని తెలిపారు. తమను అన్నింటా ఉన్నతంగా నిలిపిన జగన్‌ను సిఎంగా కొనసాగించేలా మహిళలు ఓటేసారని తెలిపారు.

# మచ్చుకైనా కానరాని పచ్చదనం



వెలవెలబోతున్న మహాత్మాగాంధీ పార్కు

- వెలవెలబోతున్న భీమిలిలోని జివిఎంసి పార్కులు
- పెదవి విరుస్తున్న సందర్శకులు
- వేసవిలో పిల్లలకు ఆటవిడుపు లేని పరిస్థితులు
- నిర్వహణలో నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు

ప్రజాశక్తి - భీమునిపట్నం : పరుగులెడుతున్న జీవితంలో కాసింత ఆటవిడుపు, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో అనేకమంది పార్కులను సందర్శించడం పరిపాటి. అయితే భీమిలి జోన్ పరిధిలో పలు పార్కులకు వచ్చిన సందర్శకులు అక్కడ మచ్చుకైనా పచ్చదనం కానరాకపోవడంతో పెదవి విరుస్తున్నారు. సముద్రం నుంచి వచ్చే గాలి తప్ప, అక్కడ కూర్చొనేందుకు క్రోటన్ మొక్కల నీడైనా లేదని వాపోతున్నారు. జివిఎంసి యంత్రాంగం నిర్లక్ష్యం, నిర్వహణాలోపం వల్ల ఎడారిని తలపించేలా పార్కులు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

జివిఎంసి భీమిలి ఒకటో జోన్‌లో సాగర తీరాన లైట్ హౌస్‌కు ఆనుకుని ఉన్న మహాత్మాగాంధీ పార్కు, గోకుల్ పార్కుల్లో పచ్చదనం మచ్చుకు కూడా కనబడని పరిస్థితి నెలకొంది. మానసిక, శారీరక ఒత్తిడికి గురైన ప్రజలు కాసింత ఉపశమనం పొందేందుకు సాగర తీరాన ఉన్న పార్కులకు వస్తే నిరుత్సాహానికి గురయ్యే పరిస్థితులున్నాయి.

ఇక్కడున్న పార్కులకు వచ్చే వారు ఎదురుగా ఉన్న సముద్రాన్ని చూసి ఆనందిస్తూ, చల్లని గాలిని ఆస్వాదించడమే తప్ప, పార్కుల్లో సేదదీరే పరిస్థితి లేదు. పార్కుల్లో పచ్చిక బయళ్లు, క్రోటన్స్ మొక్కలు, చెట్ల కిందన ఉన్న బెంచీలు వంటివేవీ ఇక్కడున్న పార్కుల్లో కానరావు. జివిఎంసి ఏర్పాటు చేసిన సాగరకన్య, డాల్ఫిన్, మత్స్యకారుని బొమ్మ, మహాత్మాగాంధీ, బుద్ధుని బొమ్మలు, భీమిలి పేరుతో లవ్ సింబల్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా ఉన్నా, పచ్చదనం లేని పార్కులేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పార్కు ఎంత విశాలంగా ఉన్నా, ఎన్ని కృత్రిమంగా ఏర్పాటుచేసినా బొమ్మలు, ఇతరత్రా హంగులు ఉన్నా, గ్రీనరీ లేకుంటే ఏదో వెలితి కొట్టొచ్చినట్టు కనబడుతుందనడం లో ఏమాత్రం సందేహం లేదు. పార్కుల్లో పచ్చిక బయళ్ళు, చుట్టూరా అందమైన పచ్చని మొక్కలు ఉంటే పార్కుల అందమే వేరు. ప్రస్తుత వేసవిలో పాఠశాలలకు సెలవులు రానే వచ్చాయి. పార్కులకు వచ్చే పిల్లలు అనుభూతి పొందాలంటే, నీలి సంద్రమే కాదు. పరుచుకున్న పచ్చదనం కూడా ఉండాలి. అప్పుడే పిల్లల ఆనందానికి అవధులు లేకుండా ఉంటుంది. గ్రీనరీ వలన అందం, ఆహ్లాదమే కాదు , పర్యావరణ పరిరక్షణకు కూడా పచ్చదనం ఎంతగానో దోహదపడుతుంది. ఆ దిశగా జివిఎంసి అధికారులు దృష్టి సారించాలని పలువురు సందర్శకులు కోరుతున్నారు


బీచ్ పార్కుల్లో కానరాని పచ్చదనం


గోకుల్ పార్కు లో మచ్చుకు కూడా కానరాని పచ్చదనం

## రోడ్డు మార్జిన్ ఆక్రమణపై ఫిర్యాదు

### - అధికారులు, పోలీసుల ఉదాసీనతపై సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ ఆవేదన



సిఎంఆర్ కాంప్లెక్స్ వద్ద తాళ్ళు, బోర్డులతో రోడ్ మార్జిన్ ఆక్రమణ

ప్రజాశక్తి-గాజువాక : పాత గాజువాక కూడలి సమీపంలోని సిఎంఆర్ కాంప్లెక్స్ యాజమాన్యం హైవేను ఆనుకుని రోడ్ మార్జిన్‌ను ఆక్రమించి తాళ్ళు కట్టి నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయడాన్ని జివిఎంసి 72వ వార్డు కార్పొరేటర్, సిపిఐ ఫ్లోర్ లీడర్ ఎజె స్టాలిన్ తప్పుబట్టారు.ఈ మేరకు శుక్రవారం విశాఖ నగర పోలీసు కమిషనర్, జివిఎంసి కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించిన సిఎంఆర్ యాజమాన్యంపై తక్షణమే తగుచర్యలు తీసుకోవాలని స్టాలిన్ డిమాండ్ చేసారు

సిఎంఆర్ కాంప్లెక్స్ యాజమాన్యం హైవేను ఆనుకుని రోడ్ మార్జిన్‌ను ఆక్రమించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి, ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. సిఎంఆర్ కాంప్లెక్స్ వెనుకనున్న చైతన్య నగర్ కాలనీలో పలు విద్యా సంస్థలు ఉండడంతో విద్యార్థులు, పాదచారుల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని ఆక్షేపించారు.. తక్షణమే గాజువాక పోలీసులు, జివిఎంసి యంత్రాంగం స్పందించి సిఎంఆర్ కాంప్లెక్స్ యాజమాన్యం ఆక్రమించిన రోడ్ మార్జిన్‌ను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్టాలిన్ డిమాండ్ చేసారు.

## 1191వ రోజుకు ఉక్కు దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలు శుక్రవారం 1191వ రోజుకు చేరుకున్నాయి. రిలే నిరాహార దీక్షల శిబిరంలో యూఏటిడి ఇన్స్ట్రుమెంటేషన్ ఆర్ అండ్ డి కన్‌స్ట్రక్షన్ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పైన, కార్మికుల పైన జరుగుతున్న కుట్రలను అడ్డుకోవడానికి పోరాటమే మార్గమన్నారు. నెల రోజులుగా ఉక్కు ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు నిల్వల రాక కోసం సహకరించిన అధికారులకు ఉద్యోగులకు గంగవరం పోర్టు కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా యాజమాన్యం పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటివరకు ఉక్కు కార్మికులకు నిలుపుదల చేసిన వేతనాలను వెంటనే చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వైపుల నుంచి విశాఖ ఉక్కు పై దాడిని మొదలుపెట్టిందని, ఈ దాడులు అడ్డుకొని పోరాటాలను చేయడానికి కార్మికుల సిద్ధంగా ఉండాలన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఎప్పటికీ గత మూడు సంవత్సరాలుగా అనేక పోరాటాలు నిర్వహించామని దాని ఫలితంగా ఇప్పటివరకు ప్లాంటు జోలికి వచ్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెనకడుగు వేస్తూ వచ్చిందన్నారు.

# ఆనందపురంలో అత్యధిక శాతం పోలింగ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : తాజాగా జరిగిన ఎన్నికల్లో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం మండలంలో అత్యధికశాతం పోలింగ్ నమోదైంది. భీమిలి నియోజకవర్గంలో 75.96శాతం పోలింగ్ నమోదుకాగా, మండలాల వారీగా పరిశీలిస్తే ఆనందపురంలోఅత్యధికంగా 88.26 శాతం, పద్మనాభంలో 86.75, భీమిలిలో 85.85శాతం, జివిఎంసి పరిధిలోని 12వార్డుల పోలింగ్‌ను పరిశీలిస్తే 2,4 వార్డులను మినహాయిస్తే, మిగిలిన పది వార్డుల్లో నియోజకవర్గ సగటు పోలింగ్ కంటే తక్కువే నమోదు కావడం విశేషం.

ఇక మండలాల వారీగా పరిశీలిస్తే, ఆనందపురం మండలంలో 51,354 ఓట్లకుగాను 45,325 ఓట్లు (88.26 శాతం), పద్మనాభం మండలంలో 42,145 ఓట్లకుగాను 36,561(86.75), భీమిలి మండలంలో 36,586 ఓట్లకు గాను 31,408(85.85) ఓట్లు నమోదయ్యాయి.

**జివిఎంసి పరిధిలోని వార్డుల వారీగా..**

భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జివిఎంసి ఒకటో వార్డులో 15,737 ఓట్లకుగాను11,450 ఓట్లు (72.76), రెండో వార్డులో 16,803 ఓట్లకు గాను 12,906(76.81), మూడో వార్డులో 15,068 ఓట్లకుగాను 10,387(68.93), నాల్గో వార్డులో 18,226 ఓట్లకుగాను 14,304(78.48), 5వ వార్డులో 33,755 ఓట్లకుగాను 23,689 (70.18), 6వ వార్డులో 41,391 ఓట్లకుగాను 27,439 (66.29), 7వ వార్డులో 35,408 ఓట్లకు గాను 23,548 (66.59), 8వ వార్డులో 22,740 ఓట్లకుగాను 15,842 (69.67), 14వ వార్డులో 1550 ఓట్లకుగాను 1037 (66.90), 15వ వార్డులో 3067ఓట్లకు గాను 2021 ఓట్లు (65.90), 45వ వార్డులో 6075 ఓట్లకుగాను 3962 (65.22), 89వ వార్డులో 7,921 ఓట్లకుగాను5,596 (70.65), 98వవార్డులో 15,187 ఓట్లకుగాను 10,270 (67.62) ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తంగా 3లక్షల 63వేల 13 ఓట్లు ఉంటే, 2లక్షల 75వేల 745 (75.96) ఓట్లు పోలయ్యాయి.

# అట్టహాసంగా ఎంపిఎల్ -2 ప్రారంభం

ప్రజాశక్తి- పిఎం పాలెం: యువత చెడు మార్గంలో వెళ్లకుండా సామాజిక స్పృహ, స్నేహభావాన్ని పెంపొందించుకునేందుకు క్రీడలు దోహదపడతాయనిని ఎబి.గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఎంఎస్ స్వరూప్, వేదాంత హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ శివ అన్నారు. శుక్రవారం పిఎం పాలెం క్రికెట్ స్టేడియం ఎంపిఎల్ సీజన్-2 క్రికెట్ పోటీలను మ్యాచ్ అంపైర్స్, పర్యవేక్షణ, ఎంపిఎల్.అధ్యక్షులు వాండ్రాసి రవి, ఆదిత్యవర్మ, నక్కా శ్రీధర్, సేకరి శ్రీనివాస్, పోతిన అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, గరే గురునాథ్, కోర్రాయి సురేష్‌లతో కలిసి సంయుక్తంగా ప్రారంభించారు. మధురవాడ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మధురవాడ యువత, బైపిల్లి ప్రసాద్ పర్యవేక్షణలో వారం రోజులపాటు నిర్వహించే ఎబి గ్రూప్ ఎంపిఎల్. సీజన్-



క్రీడాకారుల జెర్సీలను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు


2 పోటీల్లో 5,6,7,8 వార్డుల నుండి సుమారు 8క్రికెట్ జట్లు తలపడనున్నాయి. టోర్నీకిసంబంధించి ట్రోఫీని, క్రీడాకారుల జెర్సీలను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో మధురవాడ రాక్ స్టార్స్, కొమ్మాది లయన్స్, బొట్టవానిపాలెం బుల్స్, చంద్రంపాలెం టైగర్స్, బక్కన్నపాలెం రాయల్ స్ట్రైకర్స్, పిఎం.పాలెం సూపర్ కింగ్స్, పరదేశిపాలెం క్రికెట్ ఆర్మీ ఎండాడ హెచ్‌పిఎ.- 11 జట్లు తలపడనున్నాయని నిర్వాహకులు వెల్లడించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు డాక్టర్ ఎంఎస్ స్వరూప్, డాక్టర్ శివ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తే మంచిపేరుతోపాటు బంగారు భవిష్యత్ ఉంటుందని,యువత క్రీడాస్ఫూర్తితో మెలగాలని పిలుపునిచ్చారు. ఎంపిఎల్ సీజన్ -2నిర్వాహకులను అభినందించారు కార్యక్రమంలో జగ్గపిల్లి నరేష్, మామిడి దుర్గారావు పసుపులేటి రామచలం, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపిఇపిడిసిఎల్ మూడో జోన్ ఆపరేషన్స్ ఎఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పద్మనాభం సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11కెవి రెడ్డిపల్లి ఫీడర్ నిర్వహణ, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్లు, కొమ్మల నరికివేత. లైన్ మరమ్మతులు, ఇతర పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ ఫీడర్ పరిధిలోని శేరిఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు, నరసాపురం, తునివలస, చిన్నాపురం, నేరెళ్లవలస, కోయపేట, బుద్ధిపేట, సుంకరిపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# రామాలయ నిర్మాణానికి విరాళం



రూ.50 వేలు విరాళం అందజేస్తున్న గోపీబాబు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ . రెల్లిపేట గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రామాలయాన్ని పూర్తి చేసేందుకు అనంత పద్మనాభ సేవాసంస్థ అధ్యక్షుడు డి.గోపాల కృష్ణమూర్తి రాజు, (గోపీబాబు) సంస్థ తరపున గురువారం రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. విరాళం మొత్తాన్ని గ్రామ పెద్దలకు అందజేశారు. ఈసందర్భంగా గోపీబాబు మాట్లాడుతూ దాతల సహకారంతో మూడు నెలల్లో రామాలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. గర్భాలయంలో గ్రానైట్ వేయిస్తామన్నారు. కాగా రామాలయ నిర్మాణానికి అనంతవరం మాజీ ఉపసర్పంచ్ గేదేల చంద్రరావు రూ.20వేలు విరాళం ఇస్తామని ప్రకటించారన్నారు.కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కె.దామోదరరావు, టిడిపీ మాజీ అధ్యక్షుడు పివి. రమణ, కర్నెడ్డి శ్రీరాములు పాల్గొన్నారు.

## కంటి కేన్సర్‌పై అవగాహనకు
# 26న వైట్‌థాన్ రన్



వైట్‌థాన్ టీ షర్టును ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథి సీర జయరామ్

ప్రజాశక్తి - ఆరిలోవ : పిల్లల్లో వచ్చే రెటినో బ్లాస్టోమా అనే కంటి కేన్సర్‌పై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ముందుగా గుర్తించి చికిత్స చేయిస్తే కంటిచూపుతో పాటు పిల్లల జీవితాలను కాపాడుకోవచ్చని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి, ఇనిస్టిట్యూట్ ఓక్యులర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సునీత అన్నారు. ఎల్‌వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రెటినోబ్లాస్టోమా అనే కంటి కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు, నిధుల సమీకరణకు ఈ నెల 26న వైట్‌థాన్ రన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబందించిన టిషర్టును విశిష్ట అతిధులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బాపారావు, సెక్రటరీ బాలకృష్ణరాయ్, వైజాగ్ రన్నర్స్ సొసైటీ, ఎల్‌విపిఇఐ ప్రతినిధులు డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ్ సమక్షంలో అర్జున్ పురస్కార గ్రహీత, బాక్సింగ్ కోచ్ సీర జయరామ్ శుక్రవారం ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీర జయరామ్ మాట్లాడుతూ రెటినో బ్లాస్టోమాను ముందుగానే గుర్తించి, చికిత్స అందిస్తే ఎంతో మంది పిల్లల చూపును, జీవితాలను కాపాడవచ్చన్నారు. ఈ వ్యాధిపై ఈ నెల 26న ఆర్‌కె బీచ్ కాళీమాత టెంపుల్ వద్ద ప్రారంభమయ్యే వైట్‌థాన్ అవగాహన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఒక్యులర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సునీత మాట్లాడుతూ, వైట్‌థాన్ రన్‌కు సంపూర్ణ మద్దతును అందిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్, వైజాగ్ రన్నర్స్ సొసైటీ, శారద బేకరీ, ఒమేగా హాస్పిటల్స్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## 210 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుసులవాడ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కుసులవాడ, పరిసర గ్రామాలకు చెందిన 210 మందికి వైద్యసేవలు అందించారు. స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ అఖిల, డాక్టర్ శ్రావ్య, ఆనందపురం పిహెచ్‌సి డాక్టర్ ఎం గంగునాయుడు, డాక్టర్ షెహనాజ్ సాధియ, రోగులకు వైద్య సేవలు అందించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు చికిత్స చేశారు. సిహెచ్ఒ పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కష్ణ మోహన్, సచివాలయం కార్యదర్శి జీవన్‌లత, టిబి సూపర్‌వైజర్లు వీరబ్రహ్మం, సురేష్ పాల్గొన్నారు



# నిగనిగంతా దగానే..!

- మామిడి మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాల వినియోగం
- రంగే తప్ప రుచి లేని పండ్లతో ఆరోగ్యానికి ప్రమాదం
- అన్నీ తెలిసినా అందరిలోనూ ఉదాసీనతే
- రైఫనింగ్ ఛాంబర్ల ద్వారా మగ్గబెట్టేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి-కలెక్టరేట్ : నగరంలో ఎక్కడ చూసినా మామిడి పండ్లు కనిపిస్తున్నాయి.చూస్తే నోరూరేలా నిగనిగలాడిపోతున్నాయి. అలా అని కొని నోట్లో వేసుకుంటే పుల్లగా, కాస్త వెగటుగా ఉంటున్నాయి. పక్వానికి రాకముందే కాయల్ని కోసి, రసాయనాల వినియోగంతో వాటిని పండ్లగా మార్చడం వల్ల కలిగే అనర్థానికి ఇది నిదర్శనం. మామిడి పండ్లు పూర్తిస్థాయిలో పక్వతతో పండితేనే మంచి రుచి ఉంటుందని తెలిసినా, వాటిని ముందుగానే కోసి, రసాయనాలతో పండించడం వల్ల రుచి ఉండదు సరికదా, ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఈ ప్రక్రియ చట్టప్రకారం నేరం కూడా, అయినా అటు వ్యాపారులుగానీ, ఇటు కొనుగోలుదారులకు గానీ ఇవేవీ పట్టవు. నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోరు..ఈ తరహాలో పండించిన మామిడి పండ్లను తినడం ద్వారా జీర్ణక్రియ, కేన్సర్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది రైతులు తమ ఇళ్లలోనే ఒక గదిలో మామిడి కాయలను ఉంచి కార్బైడ్, అగరబత్తి పొగ ద్వారా మగ్గిస్తారు. ఈ తరహాలో మామిడి కాయలను పండుగా తయారు చేయడం వల్ల త్వరగా పండు పక్వానికి వచ్చేయడం, తక్కువ ఖర్చుతో కూడుకోవడంతో అందరూ దీనినే అనుసరిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. దీనికి కనీసం 3 నెలల జైలు, రూ.లక్ష జరిమానా విధించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

### జిల్లాలో గణనీయంగా తగ్గిన మామిడి దిగుబడి

జిల్లాలో సుమారు 35 వేల ఎకరాల్లో మామిడి సాగవుతుంది.ఎ కరాకు కనిష్టంగా అయిదు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఉత్తరాంధ్రలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పోలిస్తే చాలా తక్కువగా విశాఖ జిల్లాలో ఈ పంట సాగవుతుంది. స్థానికంగా అమ్మడంతో పాటు కొన్ని ముఖ్య కేంద్రాలనుంచి కోల్‌కతా, ఢిల్లీలకు ఎగుమతి చేస్తున్నారు.

### ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉంది. ఎప్పటిలాగానే పక్వానికి రాకముందే పంటను కోసేస్తున్నారు.వాటిని ఆకర్షనీయంగా పండించేందుకు నిషేధిత రసాయనాలన్నీ వినియోగిస్తున్నారు. నగరంలోని సీతంపేట పరిధిలోని పళ్ల వ్యాపారి గోదాముపై ఇటీవల దాడిచేసిన విజిలెన్స్ అధికారులు నిషేదిత కార్బైడ్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. పండ్ల వ్యాపారుల అత్యాశ అధికారుల ఉదాసీనత ప్రజారోగ్యానికి ముప్పు తెచ్చి



రైఫనింగ్ చాంబర్లలో మగ్గుతున్న మామిడి పండ్లు

పెడుతోంది. కార్బైడ్ దొరకని పక్షంలో పొరుగు దేశాల నుంచి దిగుమతి అయిన పౌడర్లు, రసాయనాలతో మామిడినిమగ్గిస్తున్నారు. దీంతో అమత ఫలాలు కాస్తా విష ఫలాలుగా మారిపోతున్నాయి

### వ్యత్యాసం గుర్తించడం సులవే..

సహజంగా పండిన మామిడి పండ్లు, రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లను గుర్తించడం లో ఒక సులువైన మార్గం ఉంది. సహజంగా పండిన మామిడి పండును నీటిలో వేస్తే అది మునిగిపోతుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు అయితే, పండు పెద్దది అయినప్పటికీ, బరువుతో ఉన్నా అది నీటిలో మునగదు తేలుతుందని రైతులు అంటున్నారు. అంతే కాకుండా సహజంగా పండిన మామిడిపండు అయితే దాని బొడ్డు వద్ద వాసన చూస్తే రుచికరమైన వాసన వస్తుంది.. అదే రసాయనంతో పండించినది అయితే అటువంటి సువాసన రాదు. ఇక మార్కెట్ లో మామిడి పండ్ల ధర కాస్త అధికంగానే ఉంది. అందరూ ఇష్టపడే బంగినపల్లి మామిడిపళ్ళు కిలో రూ.100 నుంచి రూ.120 విక్రయిస్తున్నారు. ఇక రైతు బజార్లలో కిలోకు రూ.20 వరకు తగ్గించి అమ్ముతున్నారు.

### రైఫనింగ్ చాంబర్లు ఏర్పాటుకు ప్రోత్సాహం

మామిడి పండ్లను ఎటువంటి విష పూరిత రసాయనాలు వినియోంచకుండా మగ్గబెట్టేందుకు ప్రభుత్వం రైఫనింగ్ చాంబర్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. అయితే ఈ చాంబర్ నిర్వహణలో ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించారు. రైతులు మాత్రమే కాదు వ్యాపారులు కూడా తమ మామిడి పండ్లను మగ్గించుకోవచ్చు. రైఫినింగ్ ఛాంబర్లో మొదటి రోజు ఎసి ద్వారా శీతలీకరణ చేస్తారు. తర్వాతి రోజునుంచి మూడు రోజులపాటు ఇథలిన్ గ్యాసును పంపించి కాయలను మగ్గిస్తారు. కాయ పండులా మారటానికి నాలుగు రోజుల సమయం పడుతుంది. రైఫలింగ్ చాంబర్లో మామిడి కాయలను ఉంచి మగ్గించేందుకు టన్నుకు రూ. 2 వేలు లేకుంటే రోజుకు కేటుకు రూ.2 చొప్పున వసూలు చేస్తారు. సొంతంగా రైఫలింగ్ చాంబర్లను ఏర్పాటు చేసుకోవాలనుకునే వారికి 40 నుంచి 50 శాతం ఉద్యానవన శాఖ రాయితీ అందిస్తుంది.

## ఆటోనగర్‌లో లక్ష్మీ మోబ్స్ అవుట్‌లెట్ ప్రారంభం



ప్రారంభిస్తున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి -గాజువాక: గాజువాక ఆటోనగర్‌లో లక్ష్మీ మొబ్స్ జెన్యూన్ స్పేర్‌పార్ట్స్ అవుట్‌లెట్‌ను లక్ష్మీ గ్రూప్ సంస్థ చైర్మన్‌కంభంపాటి రామమోహనరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖపట్నంలోని వినియోగదారుల కోసం లక్ష్మి మోబిస్ సంస్థ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామన్నారు. నాణ్యమైన స్పేర్‌పార్ట్స్ తమ అవుట్‌లెట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.ఈ అవుట్‌లెట్‌లో హ్యుందాయ్ కార్ స్పేర్‌పార్ట్స్ కస్టమర్లకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో .లక్ష్మీ హ్యుందాయ్ ఆర్ఎం ఆర్జిత్‌సేన్ గుప్తా, పిబిడిఎం నండూరి వేణుగోపాల్, లక్ష్మి మాబిస్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 76 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళా నిర్వహిస్తున్న కంపెనీల హెచ్‌ఆర్‌లు

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక ఆదర్శ డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 76 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్ఇ ఫ్లోరా తెలిపారు కోజెంట్ ఇ-సర్వీస్ హెచ్‌ఆర్ భాస్కర్, కెరియర్ స్కూల్ సొల్యూషన్స్ హెచ్‌ఆర్ బృంద, ముత్తూట్ గ్రూప్ హెచ్‌ఆర్ గణేష్, అనిల్, జాబ్ డీలర్స్ హెచ్‌ఆర్ సంతోష్, ఇన్నోవ్ సోర్స్ హెచ్‌ఆర్ ప్రవీణ్, వీల్స్‌మార్ట్ హెచ్‌ఆర్ ధనంజయ్, శిరీష ఈ జాబ్‌మేళాలో పాల్గొని, తమ సంస్థలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేశారు. జాబ్‌మేళాలో కోజెంట్ ఈ సర్వీస్11మందిని, కెరియర్ స్కూల్ హెచ్‌ఆర్ సొల్యూషన్ 24మందిని, ముత్తూట్ గ్రూప్ ఐదుగురిని, జాబ్ డీలర్స్ సంస్థ 14మందిని, ఇన్నోవ్ సోర్స్ ఏడుగురిని, వీల్స్‌మార్ట్ 15మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఆదర్శ డిగ్రీ కాలేజీలో ప్రతి నెలా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, యువత ఇటువంటి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్ రావు తెలిపారు. జాబ్‌మేళాలో ఎఒ రవి బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎడికె రాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ సిబ్బంది కెఎస్‌ఆర్ రాజేష్, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

# ఓటేయలేదనే కక్షతో వైసిపి నేతల దాడి

## బాధ్యులపై చర్యలకు బాధితుల డిమాండ్

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి కాకుండా తమ నచ్చిన అభ్యర్థికి ఓటేశారనే కక్షతో వైసిపి నేతలు గూండాల్లా ప్రవర్తించి దాడులకు తెగబడడం దుర్మార్గమని ఉత్తర నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు ఆరోపించారు సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బర్మా క్యాంపునకు చెందిన ధనలక్ష్మి, మణికంఠ, నూకరత్నం, రమ్య అనే వాళ్లపై వైసిపి నేత బొగ్గు శ్రీను ఆధ్వర్యంలో భాస్కర్, సాయి, ఆశ, చిన్ని, భూలోక, మరి కొంతమంది రాత్రి సమయంలో దాడి చేశారని, బాధితులను నెత్తురోడేలా చిత్రహింసలు పెట్టి కొట్టారని ఆరోపించారు. రౌడీయిజం చేసే రోజులు పోయాయని వైసిపి నేతలు గుర్తించాలని హెచ్చరించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను కలిసి కోరనున్నట్లు వెల్లడించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.బాధితుల్లో ఒకరైన నూకరత్నం మాట్లాడుతూ, ఈనెల 15న వైసిపి నేతలు గుంపుగా దాడిచేసి, తన తల్లిచెల్లి, తమ్ముళ్లను కర్రలతో కొట్టారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి సమయంలో అక్కడే ఉన్న పోలీసులు, వైసిపి గూండాలకు వత్తాసు పలకడం బాధాకరమని ఆవేదన వెలిబుచ్చారు.

# హెచ్‌ఎమ్‌లకు షోకాజ్ నోటీసులు అన్యాయం

## డిఇఒకు యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

నాడు-నేడు పథకం ఫేజ్ - 2 పనుల్లో జాప్యం చేస్తున్నారనే నెపంతో 227 మంది ప్రధానోపాధ్యాయులకు అనకాపల్లి జిల్లా విద్యాధికారి వెంకట లక్ష్మమ్మ షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఈ విషయమై యుటిఎఫ్ నాయకులు శుక్రవారం డిఇఒ వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ మార్చి నెలలో నిధులు జమ చేసి, మే నెల రెండవ వారంలో పనులు పూర్తి కాలేదనే నెపంతో 227 మంది హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. నిధులు జమైన కాలం నుంచి ఈ రెండు నెలల్లో పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేషన్, స్పాట్ వాల్యుయేషన్, సార్వత్రిక ఎన్నికల శిక్షణలు, ఎన్నికల విధులు వంటి పనులలో ఉపాధ్యాయులందరూ నిమగ్నమై ఉన్నారని తెలిపారు. అందువల్ల మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే షోకాజ్ నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ వేధింపులుగా అనుమానించాల్సి వస్తుందని పేర్కొన్నారు. డిఇఒ తక్షణమే షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఈవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ ఈ డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి జోగా రాజేష్, సీనియర్ నాయకులు చిట్టియ్య, బాబూరావు, సతీష్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు



స్థల పరిశీలన చేస్తున్న నాయకులు, అధికారులు

## సంతలో షెడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్ళపాలెం సంతలో సుమారు 60 మంది చిరు వ్యాపారులకు గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యాన నాబార్డ్, పంచాయతీ నిధులతో షెడ్లు నిర్మాణానికి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నాయకులు గల్లా రాజు మాట్లాడుతూ మార్కెట్లో పాకలు వల్ల చిరు వ్యాపారాలు ఇబ్బందులు పడుతున్నారని, షెడ్లు వద్ద సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే బాత్‌రూమ్స్ కూడా కట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు వల్ల ఆలస్యమైందని, పనులు త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పుర్రె నర్సింగరావు, అప్పికొండ అప్పారావు, కర్రి సత్యనారాయణ, కర్రి గోవింద్, కర్రి లోవరాజు, తోరం గణేష్, బయనాల నాయుడు, ముత్తా నాగేశ్వరరావు, గ్రామ స్వరాజ్య సమితి ఏఓ శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఆఫీసర్ నాయుడు, చిన్ని రాజీవ్ పాల్గొన్నారు.



ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులు

## లైపై టెక్నాలజీపై డైట్ విద్యార్థుల ప్రాజెక్టు

ప్రజాశక్తి-అనకాపల్లి

దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో టెలికమ్యూనికేషన్స్ డే సందర్భంగా లైఫై టెక్నాలజీపై ఆ కళాశాల విద్యార్థినులు శుక్రవారం ప్రాజెక్ట్ రూపొందించారు. లైఫై టెక్నాలజీ ద్వారా మనం ఇచ్చిన సిగ్నల్ లైట్ ద్వారా ట్రాన్స్‌ఫర్ అయి దానికి అమర్చిన సెన్సార్ ద్వారా సిగ్నల్ రిసీవ్ చేసుకుంటుందని విద్యార్థినులు తెలిపారు. ఈ పరికరం సహాయంతో వాహనాల వేగాన్ని అంచనా వేసి డిస్‌ప్లే చేస్తుందన్నారు. ఉష్ణోగ్రతను కూడా రిసీవ్ చేసుకుని డిస్‌ప్లే చేస్తుందని విద్యార్థినులు చల్లా లక్ష్మి ఐశ్వర్య, పి.ఉమ సుప్రజ తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి ఆర్డినో బోర్డ్, ఎల్‌సిడి డిస్‌ప్లే లైట్, సెన్సార్, మైక్రోఫోన్, స్పీకర్ వాడినట్లు వారు చెప్పారు. ఈ పరికరం తయారు చేయడానికి సుమారు రూ.2000 ఖర్చు చేశామన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సంబంధిత విద్యార్థులను, ప్రాజెక్టు గైడ్ బి.శేషగిరిరావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకాడమిక్ డాక్టర్ కె.పార్వతి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ, షేక్ షబీన, ఎస్.విద్య, కె.పద్మ పాల్గొన్నారు.

# రాళ్లు తేలిన రహదారి

## ఏడాదిగా ఇదే పరిస్థితి

## తీవ్ర ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని పెద్దమదిన జంక్షన్ నుండి పిల్లవానిపాలెం వరకు గల రహదారి రాళ్లు తేలిపోవడంతో ఏడాదిగా ఈ మార్గంలో ప్రయాణం నరకంగా మారింది. గతంలో ఉన్న తారురోడ్డు పెద్ద పెద్ద గోతులు పడడంతో తారురోడ్డు పునర్నిర్మాణానికి ఏడాది క్రితం స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా జెసిబిలతో రోడ్డంతా తవ్వి మార్జిన్లు వేసి ఆరు నెలల క్రితం పనులు నిలిపివేశారు. దీంతో పెద్ద పెద్ద గొయ్యలు ఏర్పడి వాహనాలు రాకపోకలకు ఏమాత్రం అనుకూలంగా లేకుండా పోయింది. దీంతో వాహనదారులు ఇక్కట్లపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో మళ్లీ పనులు ప్రారంభించి పెద్ద మదిన నుండి ఉప్పరగూడెం వరకు ఈ రోడ్డుపై బేబీ చిప్స్, డస్ట్ వేసి రోలింగ్ చేశారు. మిగిలిన భాగం అలాగే వదిలేశారు. రోలింగ్ చేసిన ప్రాంతంలో రాళ్లు తేలిపోయి ఉండగా, మిగిలిన ప్రాంతంలో పెద్ద పెద్ద గోతులు ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రతిరోజు ఈ రోడ్డు గుండా వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రావికమతం మండలంలోని పలు గ్రామాల ప్రజలతోపాటు బుచ్చయ్యపేట మండలంలోని గున్నెంపూడి, కొండ పాలెం, కేపీ అగ్రహారం, పెద్ద మదిన, చిన్న మదిన, ఉప్పరగూడెం తదితర గ్రామాలకు చెందిన వారు ప్రయాణిస్తూ ఉంటారు. వివిధ రకాల పనులు, భవన నిర్మాణ పనుల కోసం అనకాపల్లి వెళ్లి వస్తూ ఉంటారు. ఈ రోడ్డుపై రాళ్లు తేలి, గోతులు ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రాళ్లు తేలి ఉన్న పెద్దమదిన-పిల్లవానిపాలెం రోడ్డు

## ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థినీ విద్యార్థులు కళాశాలకు నేరుగా వచ్చి తమకు నచ్చిన గ్రూపులలో అడ్మిషన్లు పొందాలని సూచించారు. అనివార్య కారణాల వలన ఇంటర్ మధ్యలో ఆపేసిన వారు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో తమ కళాశాలలో చదివిన విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించారని, సి.హెచ్. సాయి దివ్య (బైపీసీ) 968 మార్కులు, జె.ఫిరోదాస్ (బైపీసీ ) 969, పి.హేమలత (ఎంపీసీ) 890 మార్కులు సాధించినట్లు తెలిపారు. తమ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో జనరల్ కోర్సులు ఎంపీసీ, బైపిసి, సీఈసీ, హెచ్ఈసి గ్రూపులు, ఒకేషనల్ ఓఎస్, ఎఐటి, ఇటి, సిఎస్‌సి కోర్సులు ఉన్నాయని వెల్లడించారు. ప్రవేశం పొందాలనుకొనేవారు కళాశాల కార్యాలయంలో ఎంవిఎస్ఎన్.మూర్తి (రికార్డ్ అసిస్టెంట్ ) 9963792958 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## ఈ-ఆఫీస్ వెర్షన్ అప్‌గ్రేడ్‌ను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో వైసిపి ప్రభుత్వం 'ఈ-ఆఫీస్ వెర్షన్ అప్ గ్రేడ్' ముసుగులో 'సేవలు నిలిపివేయడం తగదని, తక్షణమే అప్ గ్రేడ్ పనులు నిలుపుదల చేయాలని పబ్లిక్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గవర్నర్, కేంద్ర పింఛన్ల మంత్రిత్వ శాఖకు ఈమెయిల్ ద్వారా లేఖలు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 17 నుంచి 25 వరకు అప్‌గ్రేడ్ పేరుతో ఈ-ఆఫీస్‌ను ప్రభుత్వం మూసివేస్తుందని, దీనివల్ల అక్రమాలు జరిగే వీలుందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు కీలకమైన రికార్డులు గల్లంతయ్యాయని, రాష్ట్ర హైకోర్టు ఆదేశించినా ప్రభుత్వ వెబ్‌సైట్ www.apegazette.cgg.gov.in, www.goir.ap.gov.inలలో ప్రభుత్వ ఉత్తర్వులు పూర్తి స్థాయిలో పెట్టకపోవడం బట్టి పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రశ్నించాల్సి వస్తుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఈ-ఆఫీస్ వెర్షన్ మార్పు కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. అన్ని హెచ్‌వోడీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే సీసీ కెమెరాలు ఉన్న చోట పరిశీలన చేయాలని, ఫిజికల్ డాక్యుమెంట్లు, డిజిటల్ డాక్యుమెంట్లు, అన్ని ఫైళ్లు, నోట్ ఫైళ్లు, రికార్డులు మాయం కాకుండా భద్రపరిచేలా తగిన చర్యలు తీసుకోవాలని వెంకటరమణ కోరారు.

# రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

డైమండ్ హిట్స్ అధినేత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సౌజన్యంతో, జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం రైతు భారతి ఓపెన్ ఎయిర్ థియేటర్లో ఈ నెల 17 నుండి 19వ తేదీ వరకు జరుగు మూడవ రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు శుక్రవారం సాయంత్రం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి కలలకు పుట్టినిల్లు అని, తమ సంస్థ ద్వారా అనకాపల్లిలో ప్రతిష్టాత్మక సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టమని చెప్పారు. జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో మున్సిపల్ హైస్కూల్ 1974 -75 పదో తరగతి పూర్వ విద్యార్థులు సహకారంతో రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

### అలరించిన నాటికలు

అనంతరం గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ వారు 'నాలోన నీవే' నాటికను ప్రదర్శించారు. బొమ్మిడి రామకృష్ణ రచన దర్శకత్వం వహించారు. తండ్రి చనిపోయిన శ్రీరామ్‌కు తల్లి అంటే ప్రేమ గౌరవం, సర్వస్వంగా చూసుకుంటాడు. తాను ప్రేమించి పెళ్లి చేసుకున్న జానకిని కూడా అంతే ప్రేమ ఆప్యాయంగా చూస్తుంటాడు. తాను, తన భర్త మాత్రమే ఉండాలని జానకి ఆలోచించిన నేపథ్యంలో తన తల్లిని నిర్లక్ష్యం చేస్తుందనే ఉద్దేశంతో ఆమెలో మార్పు కోసం శ్రీరామ్, అతని తల్లి, జానకి తండ్రి రిటైర్డ్ జడ్జి ధర్మాత్మ కలిసి నాటకమాడి ఆమెలో మార్పు తెచ్చిన కథాంశమే నాలోన నీవే నాటిక. గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారిచే అమృత హస్తం నాటిక ప్రదర్శించారు. ఒకే తల్లి కడుపున పుట్టిన అన్న చెల్లెళ్ల మధ్య ప్రేమ అనుబంధం, ఆత్మీయతలు గొప్పగా ఉంటాయి. అయితే నేటి ఆధునిక సమాజంలో అటువంటి అనుబంధం ఆప్యాయతలు మృగ్యమై పోతున్న నేపథ్యంలో ఆ అనుబంధాలు ఎంత అవసరమో సమాజానికి తెలియజేసేదే అమృతహస్తం నాటిక. రెండు నాటికలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో కార్యదర్శి పిసిహెచ్ నాయుడు, మాజీ కౌన్సిలర్ కేఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అమృత హస్తం నాటికలో రసవత్తర సన్నివేశం



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

## ప్రజలు సామరస్యంతో మెలగాలి

ప్రజాశక్తి-మునగపాక

ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలందరూ కలిసిమెలిసి సోదర భావం, సామరస్యంతో ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటుఇవ్వకుండా సమయస్ఫూర్తితో మెలగాలని స్థానిక ఎస్ఐ ప్రసాదరావు అన్నారు. మండలంలోని గుణపర్తి, రామగిరి, చెటర్లోపాలెం, మెల్లిపాక గ్రామాల్లో శుక్రవారం ప్రజలతో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉందని, ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత 10 రోజులు వరకు ఇది అమల్లో ఉంటుందని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం రాజాం గ్రామంలోని కాలనీకి సమీపంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలోని గొర్లి శ్రీనుకు చెందిన పూరిల్లు పైభాగంలో ఉన్న విద్యుత్ వైర్ల నుండి శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు పూరిల్లుపై పడ్డాయి. దీంతో మంటలు వ్యాపించి పూరిల్లు మొత్తం అగ్నికి ఆహుతైంది. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. ఈ అగ్ని ప్రమాదంలో నిత్యావసర సరుకులు, బట్టలు, నగదు, ఇతర గృహోపకరణాలు కాలిబూడిదైనట్లు బాధితుడు గొర్ల శ్రీను తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పూరిల్లు

## కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై అవగాహన

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి గొర్రెలోవ గ్రామంలో సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌమ్య ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం వైద్య శిబిరం నిర్వహించి 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో గొర్రెలోవతో పాటు పులి గుప్ప, గుండారు బైలు, కొమ్ములవాడ, బంధ వీధి తదితర గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై అవగాహన కల్పించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పురుషులు చేయించుకోవడం వలన ఎటువంటి నష్టం కలగదని, అదే స్త్రీలు చేయించుకుంటే ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. పురుషులు కుటుంబ నియంత్రణ చేయించుకున్న ఐదు పది రోజులు వ్యవధిలో తమ పనులు యథావిధిగా చేసుకోవచ్చన్నారు. గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. గ్రామాల్లోకి వెళ్లి గర్భిణులు ఆసుపత్రుల్లో కాన్పు చేయించుకునే విధంగా ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.జోజి బాబు, పర్యవేక్షకులు బి. బాలమణి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం అరుణ కుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# యలమంచిలికి దూర ప్రాంత బస్సుల కొరత

- రైల్వే గేటు వంకతో హైవే మీదుగా సర్వీసులు
- వంతెన పూర్తయినా అదే తీరు..

ప్రజాశక్తి - యలమంచిలి

హైదరాబాదు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు 2010 వరకూ కొక్కిరాపల్లి రైలు గేటు దాటి యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చి ప్రయాణికులకు సేవలందించేవి. ఆ తరువాత యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఒక్కొక్కటిగా బస్సులు రావడం మానేశాయి. దూర ప్రాంత బస్సులను జాతీయ రహదారి బైపాస్ మీదుగా వెళ్తుండడంతో యలమంచిలి వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

కొక్కిరాపల్లి రైలుగేటుకు రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు 2009 ఫిబ్రవరి 15న ప్రారంభించారు. బ్రిడ్జి కోసం రూ.35 కోట్లు కూడా కేటాయించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాక దూర ప్రాంత బస్సు సర్వీసులు ఒక్కొక్కటిగా యలమంచిలి పట్టణంలోకి, యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి రావడం ఆగిపోయాయి. రైలు గేటు మూలంగా జరుగుతున్న ఆలస్యానికి బస్సు ప్రయాణికులు విసిగిపోతున్నారని చెప్పి దూరప్రాంత బస్సులు జాతీయ రహదారి గూండా తరలించడం మొదలు పెట్టారు. క్రమంగా తుని, కాకినాడు, రాజమండ్రి వైపు వెళ్లే బస్సులు ఒక్కటంటే ఒక్కటి కూడా రాకుండా పోయింది. దాంతో స్థానిక ప్రయాణికులు ఎన్ని అర్జీలు పెట్టుకున్నా, మండల పరిషత్, మున్సిపాలిటీలు ఎన్ని తీర్మాణాలు చేసి ఆర్టీసికి విన్నవించినా గేటు సమయాన్ని హరిస్తోందంటూ ఆర్టీసీ బస్సుల్ని బస్‌కాంప్లెక్స్‌కు పంపలేమంటూ అధికార్లు కరాఖండీగా చెప్పేశారు. చేసేదీమీ లేక గేటు నిర్మాణం ఎప్పుడవుతుందా... తమ కష్టాలు ఎప్పుడు తీరుతాయా? అంటూ ప్రయాణికులు ఎదురుచూడటం మొదలు పెట్టారు. ఎట్టకేలకు రోడ్ ఓవర్ బ్రిడ్జి సుదీర్ఘ నిర్మాణం అనంతరం 2024 ఫిబ్రవరి 22న ప్రారంభోత్సవం చేశారు. ప్రయాణికులంతా హమ్మయ్య అనుకున్నారు. బ్రిడ్జిపై నుండి రాక పోకలు మొదలై మూడు నెలలు కావస్తున్నా యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కొత్త బస్సు ఒక్కటంటే ఒక్కటీ రాకపోవడం యలమంచిలి వాసుల్ని నిరాశకు గురి చేసింది.

ప్రస్తుతం యలమంచిలి నుండి అనకాపల్లి, విశాఖకు వెళ్లే 500వై మెట్రో సర్వీసులు 28, 400వై సర్వీసులు 30, అనకాపల్లి విశాఖల నుండి పాయకరావుపేటకు పల్లె వెలుగు సర్వీసులు 17 యలమంచిలి బస్సు కాంప్లెక్స్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కంట్రోలర్ అనిల్‌కుమార్ చెప్పారు. ఇవి తప్ప తుని, కాకినాడ, రాజమండ్రి వెళ్లడానికి సర్వీసులు లేక ప్రయాణికులు రైళ్ల పైనే ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. రైళ్లలో రిజర్వేషన్ లేని ప్రయాణాలు ఎంతనరకమో అందరికీ తెల్సిందే. ఎన్నికలు ముగిశాయి. నెగ్గిన ప్రజాప్రతినిధులు బస్సు ప్రయాణికుల కష్టాలు తీరే విధంగా కృషి చేయాలని యలమంచిలి వాసులు కోరుతున్నారు.



రోడ్డు ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించిన దృశ్యం (ఫైల్‌ఫోటో)



ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ కంట్రోలర్ అనిల్‌కుమార్



బస్సులు లేక విద్యార్థులు ఫుట్‌పాత్‌పై వేలాడి వెళ్తున్న దృశ్యం

## బుద్ధ జయంతి సందర్భంగా జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 23న గౌతమ బుద్ధుని 2,568వ జయంతి (బుద్ధ పూర్ణిమ) సందర్భంగా స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు గల విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతి పురాతన బౌద్ధ క్షేత్రం శంకరం గ్రామంలోని 'బొజ్జన్న కొండ చరిత్ర- విశిష్టత - విశేషాలు' అన్న అంశంపై ఈ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు నాలుగు అరతావు పేజీలకు మించకుండా వారి స్వదస్తూరితో తెలుగు భాషలో రాసి ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోగా తమ అడ్రస్‌కు స్వయంగా గాని, పోస్ట్ ద్వారా గాని, వాట్సాప్ నెంబర్‌కుగాని పంపించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే వారికి ఏ విధమైన ప్రవేశ రుసుము లేదని, విజేతలకు ఈ నెల 23న బుద్ధ జయంతి సందర్భంగా అతిథుల చేతుల మీదుగా బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్, విశ్రాంత జైల్ హెడ్ వార్డర్, డోర్ నెంబర్ 10-01-88, పిళ్లావారివీధి, చేపల బజార్ దగ్గర, అనకాపల్లి-531001 అన్న అడ్రస్‌కు వ్యాసరచనలు పంపించాలని కోరారు.

## బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి కొల్లూరు వీధికి చెందిన దీవి నాగేంద్ర (12) ఈనెల 16 నుంచి కనిపించడం లేదని బాలుడి తండ్రి ఈశ్వరరావు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడికి తన పేరు తప్ప మరేమి చెప్పలేడని, చామన చాయ రంగు కలిగిన ఈ బాలుడు ఇంటి వద్ద నుంచి వెళ్ళేటప్పుడు ఎరుపు రంగు చొక్కా వేసుకున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు.



నాగేంద్ర

## డొంకరాయి కెనాల్ మరమ్మతులకు అనుమతులు కోరాం

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతులు, నిర్వహణ పనులకు అనుమతులు కోరినట్లు ఏపి జెన్కో ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏడాది డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కెనాల్ ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వాటిని గుర్తించి అక్కడ కెనాల్ పటిష్టత కోసం గ్రౌటింగ్ కాంక్రీట్ పనులు నిర్వహిస్తామని తెలిపారు. కెనాల్ నిర్వహణ పనులు చేపడితే సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని 25 మెగావాట్లు సామర్థ్యం గల డొంకరాయి జల విద్యుత్ కేంద్రం, 460 మెగా ఒట్ల సామర్థ్యం గల పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. కెనాల్ నిర్వహణ పనులకు గ్రిడ్డు అధికారులు, ఏపీ జెన్కో ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ఎల్సి అనుమతులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు.

## టిడిపి నాయకుల తీరుపై బిజెపి నేతల ధ్వజం

ప్రజాశక్తి- కె.కోటపాడు

సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల నాయకులు వ్యవహరించిన తీరుపై శుక్రవారం బిజెపి మండల నాయకులు ధ్వజమెత్తారు. పోలింగ్ రోజు బిజెపి నాయకులను కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోలేదని, చిన్నచూపు చూశారని, అవమానపర్చారని మండిపడ్డారు. స్థానిక బిజెపి కార్యాలయంలో బిజెపి మండల అధ్యక్షులు కోటాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో బిజెపి నాయకులు మాట్లాడుతూ టిడిపి నాయకులు కొన్ని గ్రామాల్లో ఏకపక్షధోరణి అవలంభించారని, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తరుపున బిజెపి ఎన్నికల ఏజెంట్లు లేకుండా చేశారని ఆరోపించారు. సమావేశంలో బిజెపి నాయకులు చల్ల సత్యనారాయణ, పైల అమ్మాజీ, శరగడం సన్యాసినాయుడు, బండారు రామస్వామి పాత్రుడు, కుమార అప్పారావు, రొంగలి శ్రీనివాసరావు, సూరిశెట్టి దాసు, బైల్ గంగునాయుడు పాల్గొన్నారు.

## రైవాడ కాలువ రోడ్డుకు గండి

ప్రజాశక్తి- సబ్బవరం

రైవాడ నుండి మేఘాద్రి గెడ్డకు నీరు ప్రవహిస్తున్న కాలువ రోడ్డుకు మండలంలోని బెక్కలి పాలెం సమీపంలో గండి పడింది. దీంతో ఈ కాలువ రోడ్డులో పయనిస్తున్న ప్రయాణికులకు, వాహనదారులకు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉండటంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైవాడ కాలువ సిబ్బంది, జివిఎంసి అధికారులు స్పందించి గండిని పూడ్చాలని పలువురు కోరుతున్నారు.



రైవాడ కాలువ రోడ్డుకు పడిన గండి

# కొండ కోనల్లో జగనన్న కాలనీ

◆ నిర్మాణానికి ఆసక్తి చూపని లబ్ధిదారులు ◆ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం




కాలనీ ప్రాంతంలో నిర్మించిన బ్రిడ్జి

**ప్రజాశక్తి -కోటవురట్ల:**ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపడుతున్న జగనన్న కాలనీలో గృహాల నిర్మాణానికి పందూరు గ్రామంలో లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. పందూరు గ్రామానికి సమీపంలో కొండ పోరంబోకు భూమి సుమారు రెండు ఎకరాల కాలనీలకు కేటాయించారు. దీని కోసం 15 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం, 5 లక్షలతో బోరు, కరెంటు వంటి సౌకర్యాలు కల్పించారు. సుమారు ఇక్కడ 61 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఇల్లు మంజూరు చేశారు. ఎవరూ కట్టుకోవడానికి ఆసక్తి చూపక పోవడంతో నేటికీ ఒక ఇల్లు కూడా మొదలు పెట్టలేదు. కొండకు దగ్గరగా ఉండటంతో నిర్మాణాలు చేపట్టేందుకు వెనుకాడుతున్నట్లు లబ్ధిదారులు తెలిపారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్ల స్థలాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. మందుబాబులు మద్యం సేవించేందుకు నిలయంగా మారింది.



కొండల్లో కేటాయించిన ఇళ్ల స్థలం

## అపారిశుధ్యంతో అవస్థలు



కాలువలో నిలిచిన మురుగునీరు


**ప్రజాశక్తి-కోటవురట్ల:**మండల కేంద్రంలోని సీతారామరాజునగర్ ప్రభుత్వ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న రోడ్డు అపారిశుధ్యానికి చిరునామాగా మారింది. ఈ రోడ్డుకి ఇరువైపులా ఉన్న మురుగునీటి కాలువలు నిత్యం మురుగుతో నిండుగా దర్శనమిస్తూనే ఉంటాయి. నిత్యం దోమలతో పాటు దుర్గంధం వెదజల్లుతోంది.ఈ ప్రాంత వాసులు అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా తూతూ మంత్రంగానే కాలువలు శుభ్రం చేసి మమ: అనిపిస్తున్నారు. దీంతో, స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.



రోడ్డు సమీపాన కాలువలో నిలిచిన మురుగునీరు

### డంపింగ్ యార్డు మాదిరిగా...

## ఇందిరా మార్కెట్



**ప్రజాశక్తి - అనకాపల్లిడెస్క్:**నర్సీపట్నం మున్సిపాలిటీలోని ఇందిరా కూరగాయల మార్కెట్ డంపింగ్ యార్డును తలపిస్తోంది. చెత్త చెదారం పేరుకు పోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఈ చెత్తలోనే పశువులు సంచరిస్తున్నాయి. దీంతో మార్కెట్ కు వచ్చే వారు అనేక అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

### ఉపాధి కూలి రూ.300 చెల్లించాలి

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:**
ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి పనులు చేపడుతున్న కూలీలకు రోజు వారీగా కనీస కూలి రూ.300 చొప్పున చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కరువయ్యాయన్నారు. పనులు చేపట్టినప్పటికీ కూడా కనీస వేతనం ఇవ్వక పోవడంతో ఉపాధి కూలీలు నష్టపోతున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి సమ్మర్ అలవెన్స్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపునకు భద్రత కట్టుదిట్టం

అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీత

**ప్రజాశక్తి -పాడేరు :** సార్వత్రిక ఎన్నికలలో పోలైన ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, అడిషనల్ ఎస్పీ ధీరజ్‌లతో కలిసి స్ట్రాంగ్ రూంలను శుక్రవారం తనిఖీ చేసారు. ఓట్ల లెక్కింపు గదులను పరిశీలించి, అభ్యర్థులకు, ఏజెంట్లకు పరిశీలనకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇవియంలు, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు భద్ర పరిచిన స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేసి తలుపులకు వేసిన సీళ్లను పరిశీలించారు.భద్రతా సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసారు. తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్. ఎం.రాజు, డిఇ అనుదీప్, సిఐ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

### గంటాను కలిసిన అనిత

**ప్రజాశక్తి -నక్కపల్లి:**భీమిలి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును శుక్రవారం వైజాగ్‌లో ఆయన స్వగృహంలో పాయకరావు పేట నియోజక వర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత మర్యాదపూర్వకంగా కలిశారు. భీమిలి నియోజకవర్గంలో గంటా విజయం సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ గంటాను శాలు వాతో అనిత సత్కరించారు. అదేవిధంగా పాయకరావుపేట నియోజకవర్గంలో కూడా అనిత విజయం సాధిస్తారని గంటా ధీమా వ్యక్తం చేస్తూ అనితను శాలువాతో సత్కరించారు. ఓటింగ్ సరళి, విజయ అవకాశాల పై ఇరువురు చర్చించుకున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు విజయం కోసం సమిష్టిగా కృషి చేశారన్నారు.



గంటాను సత్కరిస్తున్న అనిత

### 18న కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని చీడిగుమ్మల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈ నెల 18న శనివారం హోమి బాబా క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో వైద్య పరీక్షలు చేసేందుకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చీడిగుమ్మల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధనుంజయ్ తెలిపారు.ఇందులో ముఖ్యంగా గర్భాశయ, నోటి, రొమ్ము క్యాన్సర్‌కి సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని చెప్పారు. 18న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 జరిగే ఈ మెడికల్ క్యాంపును ఉపయోగించుకోవాలని కోరారు.




ఖాళీగా ఉన్న పద్మావతి ఉద్యానవన కేంద్రం

### పర్యాటక ప్రాంతాలు వెలవెల

**ప్రజాశక్తి-అరకులోయ :** పర్యాటక కేంద్రమైన అరకులోయలోని సందర్శింత ప్రాంతాలు వెలవెల బోతున్నాయి. ప్రతి ఏడాది టెన్త్, ఇంటర్ పరీక్షల అనంతరం పర్యాటకులు అధిక సంఖ్యలో అరకు ప్రాంతాన్ని సందర్శించేవారు. ఈ ఏడాది ఎన్నికల హడావుడి మొదలు కావడంతో పర్యాటకుల సంఖ్య పూర్తిగా పడిపోయింది. పర్యాటకులు మచ్చుకైనా కనిపించక పోవడంతో ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలన్నీ వెలవెలపోయాయి. కాలాలతో సంబంధం లేకుండా నిత్యం కలకలలాడే అరకులోయ ఇప్పుడు వెలవెల పోతుండటంతో స్థానిక వ్యాపారులు కూడా తీవ్రంగా నష్టపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు మునుపెన్నడు లేనివిధంగా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో అరకులోయ పర్యాటకం పడకేసింది.

అరకులోయలోని గిరిజన సంస్కృతిక మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రంలో ఆదాయం పూర్తిగా పడిపోవడంతో నిర్వహణకు కూడా ఇబ్బందికరమైన పరిస్థితులు నెల కొంటున్నాయని సంబంధిత అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడి వరకు కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని స్థానికులు, పలువురు పర్యాటకులు అభిప్రాయ పడుతున్నారు.




ఖాళీగా ఉన్న మ్యూజియం

## జూన్ 18న మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి -మాడుగుల: జూన్ 18వ తేదీన మాడుగుల మోదకొండమ్మ జాతర జరగనుంది. మోదకొండమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించడానికి తేదీలు ఖరారు చేసినట్లు మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మే నెల19వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయం వద్ద, సాయంత్రం 6.15 గంటలకు గ్రామంలో పండగ చాటింపు తో ప్రారంభమై, మే 21వ తేదీ మంగళవారం ఉదయం తొమ్మిది గంటల ఐదు నిమిషాల నుంచి అమ్మవారి ఆలయం నుంచి ఘటాలు బయలుదేరి 10 గంటల ఐదు నిమిషాలకు శతకం పట్టు వద్ద కొలువు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మోదకొండమ్మ పండుగను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్


ఆభరణాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

## 'పవిత్రం' కలెక్షన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పిఎంజె జ్యూయలర్స్ తన మరో సరికొత్త కళాఖండాన్ని శుక్రవారం విశాఖలో ఆవిష్కరించింది. భారతీయ దేవాలయాల హస్తకళకు చిహ్నంగా 'పవిత్రం' పేరుతో ఈ కలెక్షన్‌ను పిఎంజె రూపొందించింది. ఈ మేరకు శుక్రవారం సిరిపురంలోని పిఎంజె జ్యూయలర్స్‌లో జరిగిన ఈ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా పిఎంజె జ్యూయలర్స్, మర్చండైజింగ్ హెడ్ నీరవ్ చల్లా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న తమ టెంపుల్ జ్యువెలరీ కలెక్షన్ 'పవిత్రం'ను లాంచ్ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. శక్తివంతమైన రత్నాలను ఈ కలెక్షన్‌లో వినియోగించామని తెలిపారు. తమ 18 స్టోర్లలో ఇవి అందుబాటులో ఉంటాయన్నారు.

# అడుగంటుతున్న భూగర్భ జలాలు

- వర్షాలు లేక తగ్గిన వాటర్ లెవెల్స్
- ఎండుతున్న చెరువులు, బావులు
- నీటి కోసం తప్పని అవస్థలు


ఉపమాకలో అడుగంటుతున్న చెరువు


ప్రజాశక్తి -నక్కపల్లి:భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కనీస అవసరాలకు నీరు వాడాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గత ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో వాటర్ లెవెల్స్ బాగా తగ్గాయి. దీంతో, చెరువులు, బావుల్లో నీరు అడుగంటుతున్నాయి. నీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత ఏడాది తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ఈ సంవత్సరం వేసవి ఆరంభంలోనే నీటి ఎద్దడి తీవ్ర తరమైంది. గతంతో పోలిస్తే ప్రతి ఇంటి వద్ద బోర్లు వేయడంతో సమస్య మరింత జటిలమైంది.

ముఖ్యంగా పల్లెల్లో బావుల్లో నీరు అడుగంటడంతో పల్లె ప్రజలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామాల్లో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు కూడా రోజు తప్పించి రోజు ఇవ్వడంతో, నీటిని పొదుపుగా వాడుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. మే నెలలోనే ఇలా ఉంటే వచ్చేనెలలో నీటి కోసం మరింత ఇబ్బందులు తప్పేటట్టు లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షం తప్ప, మిగతా రోజుల్లో వర్షాలు లేవు. అప్పట్లో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో ఉన్న చెరువులు, బావులు నిండాయి. చెరువులు, బావులు జలకళతో కళకళలాడడంతో నీటి ఎద్దడి నుండి బయట పడ్డామని జనం భావించారు. అయితే గత 5 నెలల నుండి సరైన వర్షాలు లేక 2 నెలల నుండి భానుడు నిప్పులు చెరగడంతో చెరువులు, బావుల్లో ఉన్న నీరు అడుగంటాయి. దీంతో నీటికి ఇబ్బందులు తప్పలేదు. వర్షాలు కురిసే వరకు ప్రజలకు నీటి అవస్థలు తప్పేటట్టు లేదు. ఖరీఫ్, రబీ సీజన్ లోనూ వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో అన్నదాత కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాడు.


అడుగంటిన బావి

# అధిక రక్తపోటుపై అప్రమత్తంగా వుండాలి



అనకాపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఎం అండ్ హెచ్ఓ

ప్రజాశక్తి-అనకాపల్లి: అధిక రక్తపోటు (బిపి) పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో వుండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్ పిలుపునిచ్చారు. ఈ నెల 17న ప్రపంచ రక్తపోటు దినం సందర్భంగా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కాలంలో సమాజంలో రక్తపోటు బాధితుల సంఖ్య పెరుగుతుందన్నారు. మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ లోపించడం, ఫాస్ట్ ఫుడ్స్ కారణంగా చిన్న వయసులోనే రక్తపోటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం జిల్లా కేంద్ర ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థినులచే జిల్లా ఆసుపత్రి నుండి నెహ్రూచౌక్ వరకు రక్తపోటుపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. జిల్లా కుటుంబ వైద్య విధాన సమన్వయ కర్త డాక్టర్ వీరజ్యోతి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ, ఎపిడమాలజిస్ట్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కశింకోట** : ప్రపంచ అధికరక్తపోటు దినోత్సవం సందర్భంగా కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ అధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారన్నారు. . కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**రోలుగుంట:**ప్రతీ వ్యక్తి ఆహార అలవాట్లు మార్పు చేసుకునే అలవాటు చేసుకోవాలని రోలుగుంట మండలం బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్.సునీత సూచించారు. శుక్రవారం పిహెచ్‌సి వద్ద ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, శారీరక శ్రమ లేకపోవడంతో గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. ఎక్కువగా నూనెలు, కొవ్వు పదార్థాలు, మద్యం, సిగరెట్లు, బీడీలు, గుట్కా తీసుకొనే వారికి, ఎక్కువ ఒత్తిడికి గురైన వారికి గుండెపోటు త్వరగా వస్తుందని ఆమె అన్నారు. బిపి, షుగర్ పరీక్షలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతంగా ఉండేందుకు కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రోలుగుంటలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

### జీవనశైలిలో మార్పుతో అదుపులో రక్తపోటు

**ఆనందపురం** : జీవనశైలిలో మార్పులు తీసుకురావడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం గంగునాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కుసులవాడ గ్రామంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, శారీరక వ్యాయామం, ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు అవసరమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనూ, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లలో అందుబాటులో ఉండే ఉచిత రక్తపోటు నిర్ధారణ పరీక్షలు చేయించుకుని మందులు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ప్రజలతో అధిక రక్తపోటు నివారణకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ షహనాజ్, సిహెచ్ఓ పి సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు



విశాఖలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు మురళీమోహన్

**విశాఖపట్నం** : పెద్ద జాలారిపేటలోని గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ అనుబంధ అర్బన్ హెల్త్‌ట్రైనింగ్ సెంటర్‌లో వరల్డ్ హైపర్‌టెన్షన్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'రక్తపోటును కచ్చితంగా కొలవండి, నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండి'. అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఎంవివి.మురళీమోహన్ మాట్లాడుతూ, ధూమపానం, ఆల్కహాల్, ఊబకాయం అధిక రక్తపోటుకు కారణాలన్నారు. అస్పష్టమైన దృష్టి, మైకం, వికారం, వాంతులు, అలసట, గందరగోళం, ఎపిస్టాక్సిస్, ఛాతి నొప్పి, శ్వాసలోపం,సక్రమంగా గుండె కొట్టుకోకపోవడ మొదలైనవి హైపర్‌టెన్షన్ లక్షణాలని, వీటిని గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించి తగు వైద్యసేవలు పొందాలని సూచించారు. పెద జలారిపేటలో 20 మంది నివాసితులు, గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ నుండి 10 మంది సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు (సౌత్) ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.